



అన్నమ్మఘాటీ సెంటర్‌లో అన్న క్యాంటీన్ పరిశీలిస్తున్న కమిషనర్

ఆగస్టు 5కల్లా అన్న క్యాంటీన్ల సిద్ధం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 29: ప్రభుత్వాదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ నుంచి అన్నక్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. సోమవారం ఆమె జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్ పరిధిలో ఏర్పాటుచేస్తున్న అన్నక్యాంటీన్ పనుల ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఐదు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 5వ తేదీ నాటికల్లా అన్నక్యాంటీన్లకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేసి సిద్ధం చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో పనుల ప్రగతిని పర్యవేక్షించారు. ఆమె వెంట ఎస్ఈలు పి.సత్యకుమారి, వెంకటరావు, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ లోవరాజు ఉన్నారు.



వచ్చేస్తున్నాయ్..
అన్న క్యాంటీన్లు

- జిల్లాలో 11 చోట్ల క్యాంటీన్లకు మరమ్మతులు
- ఆగస్టు 15న పునః ప్రారంభానికి సన్నాహాలు

కాకినాడ సిటీ, జూలై29: పేదల ఆకలి బాధలు తీర్చే అన్న క్యాంటీన్లు శరవేగంగా ముస్తాబవుతున్నాయి. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న అన్న క్యాంటీన్‌లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు 15న పునఃప్రారంభానికి ముహూర్తం ఖరారు చేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన అన్న క్యాంటీన్ భవనాల మరమ్మతులు చేస్తున్నారు. జిల్లాలో తొలి దశలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో 11 క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 183 క్యాంటీన్ల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.150 కోట్ల వరకు మంజూరు చేసింది. దీనిలో భాగంగా రూ.40.20 లక్షల వ్యయంతో కాకినాడలో ఐదు క్యాంటీన్ల మరమ్మతులు చేయిస్తున్నారు. ఇప్పటికే కాకినాడ సంతచెరువు వద్ద గల క్యాంటీన్ మరమ్మతు పనులు చివరి దశకు చేరాయి. అలాగే డెయిరీఫారమ్ సెంటర్, అన్నమ్మఘాటీ, జవహర్‌వీధి, బోట్ క్లబ్ ప్రాంతాల వద్ద గల అన్న క్యాంటీన్‌ల పనులు జరుగుతున్నాయి. మొత్తంగా కాకినాడ నగరంలోని ఐదు అన్న క్యాంటీన్లలో ఐవోటీ పరికరాలు, సాఫ్ట్‌వేర్ వంటివి సమకూర్చనున్నారు. పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతోపాటు గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల్లో భవనాలను ఆధునీకరిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రూ.5కే ఉదయం టిఫిన్, రూ.5కే మధ్యాహ్నం, రూ.5 రాత్రి భోజనం అందించారు. అన్నక్యాంటీన్లకు టిఫిన్లు, ఆహారం సరఫరాకు ఓ స్వచ్ఛంద సంస్థ ఇంప్లిమెంట్ ఏజెన్సీగా వ్యవహరించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ క్యాంటీన్లను మూసివేసింది. దీంతో అనేకమంది ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ మూడు పూటలా పేదల ఆకలి తీర్చనుంది. రుచికరమైన ఆహారం అందించనుంది.

ఊరిస్తున్నాయి..

- జిల్లాలో కూటమి పార్టీల నేతల్లో అంతకంతకూ పెరుగుతున్న నామినేటెడ్ ఆశలు
- పార్టీల్లో పదవుల పంపకంపై కసరత్తు పూర్తి కావడంతో ప్రయత్నాలు షురూ
- ఇన్నేళ్ల తమ కష్టం, పోరాటానికి ఫలితం దక్కబోతోందని ఆనందం
- తమను గుర్తించాలంటూ చంద్రబాబు, లోకేశ్, పవన్, మంత్రుల వద్దకు క్యూ
- సీటు దక్కని ఆశావహులు అయితే మూడు పార్టీల పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- టీడీపీ నుంచి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవుల కోసం పావులు
- అత్యధిక పదవులు పార్టీకి దక్కనున్న నేపథ్యంలో అమరావతిలో మకాం వేసి ప్రయత్నాలు
- అప్పుడే డీసీసీబీ ఛైర్మన్ కుర్చీ కోసం జిల్లాలో పలువురు సీనియర్ నేతల పైరవీలు
- అమాత్యగిరీ దక్కని జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలూ కీలక నామినేటెడ్ పదవులపై ఆసక్తి
- టీటీడీ బోర్డు, విప్, కార్పొరేషన్ల ఛైర్మన్ పోస్టులైనా వస్తాయని ఆశలు



జిల్లాలో కూటమి పార్టీల నేతల్లో నామినేటెడ్ సందడి నెలకొంది. త్వరలో పదవుల పంపకం ఉంటుందని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఆశావహులు ఎవరికివారే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవులు ఆశిస్తూ పావులు కదుపుతున్నారు. రోజుల తరబడి అమరావతిలోనే మకాం వేసి పైరవీలు తీవ్రతరం చేశారు. ప్రధానంగా టీడీపీ నుంచి జిల్లా తరపున నామినేటెడ్ పదవులు ఆశించే వారి సంఖ్య భారీగా ఉంది. తాజా ఎన్నికల్లో చివరి క్షణంలో సీటు చేజారిన నేతల దగ్గర నుంచి అమాత్య పదవులు దక్కనివారు, ఎమ్మెల్యేల తనయులు, పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నేతలు ఇలా అనేక మంది రకరకాల పదవులు ఆశిస్తూ పార్టీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా సీనియర్ నేతలు, కార్యకర్తలైతే ఇన్నేళ్ల తమ కష్టానికి గుర్తింపు నివ్వాలంటూ చంద్రబాబు, లోకేశ్‌ల వద్దకు నివేదికలతో వెళ్తున్నారు. తాము పార్టీ కోసం చేసిన కార్యక్రమాలను ఏకరువు పెడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో నామినేటెడ్ పదవుల పంపకంపై కూటమి పార్టీలో ఎవరికి ఎన్ని ఇవ్వాలనే దానిపై ఎట్టకేలకు కసరత్తు పూర్తవడంతో ఆలయాలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉన్న పోస్టుల గురించి అప్పుడే నియోజకవర్గ స్థాయి నేతలు ఆరా తీసి మంత్రులు, ఎమ్మెల్యేల చెవుల్లో వేస్తున్నారు. అటు జనసేన నుంచి సైతం తమకు గుర్తింపు నివ్వాలంటూ పవన్‌తోపాటు ఇతర ముఖ్య నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అయిదేళ్ల పోరాటం తర్వాత ఎట్టకేలకు మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈసారి కూటమి పోటీచేసి విజయం సాధించడంతో పార్టీ కోసం పనిచేసిన నేతల్లో నామినేటెడ్ పోస్టుల ఆశలు భారీగా నెలకొన్నాయి. అందులోభాగంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పోస్టులు దక్కించుకోవడం కోసం పోటీపడుతున్నారు. అటు సీఎం చంద్రబాబు కూడా త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు, కేడర్‌తో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఇదే విషయం వెల్లడించారు. అయిదేళ్లు పార్టీ కోసం పోరాడిన నేతలు, కార్యకర్తలను దిగువ స్థాయి నుంచి పైవరకు గుర్తించి పదవులు కట్టబెడతానని వివరించారు. ఈనేపథ్యంలో జిల్లాలో నామినేటెడ్ పదవులపై పార్టీ నేతలు, కేడర్‌లో ఆశలు మరింత పెరిగాయి. దీనికితోడు నియోజకవర్గ స్థాయిలో ఏపార్టీకి ఎన్ని పదవులు అనేది ఇంతకాలం స్పష్టత రాకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. తాజాగా దీనిపైనా లెక్కలు తేలిపోవడంతో సాధ్యమైనంత వేగంగా పోస్టుల భర్తీ జరగవచ్చని చెబుతున్నారు. అందులోభాగంగా టీడీపీ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ఆ పార్టీకి 60 శాతం, జనసేనకు 30, బీజేపీకి పది శాతం పదవులు దక్కనున్నాయి. జనసేన ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ఆ పార్టీకి 60శాతం పదవులు కట్టబెట్టనున్నారు. ఈనేపథ్యంలో ఎవరికి ఎన్ని వస్తాయనే లెక్కలు తేలడంతో ఆశావహులు అప్పుడే ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. తమకు ఫలానా చోట పదవి ఇవ్వాలంటూ పైరవీలు మొదలుపెట్టారు. అయిదేళ్లపాటు వెన్నంటి ఉండి చేసిన సేవలను వారికి గుర్తు చేస్తున్నారు. అటు రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులకు సైతం జిల్లాలో సీనియర్ నేతలు, టిక్కెట్ చేజారిన నేతలు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో టీటీడీతోపాటు ఇతర ఆలయ ఛైర్మన్‌లు, బోర్డు సభ్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పోస్టులు, కుడా, స్మార్ట్‌సిటీ ఛైర్మన్‌లు, గ్రంథాలయ సంస్థ, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ కార్పొరేషన్లలో పదవులపై కన్నేసి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇవికాక ఏయే వాటిలో అవకాశం ఉంటుందోనని లెక్కలేస్తున్నారు. అలాగే తమ సీనియార్టీకి మంత్రి పదవి గ్యారెంటీ అని భావించగా, ఆఖర్లో అవకాశం చేజారిన నేతలు సైతం పార్టీ అధినేత చంద్రబాబును కలిసి తమ గురించి గుర్తు చేస్తున్నారు. జిల్లాలో టీడీపీ నుంచి అయిదుగురు ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలున్నారు. అయితే కేబినెట్‌లో ఛాన్స్ ఉంటుందని వీరు భావించారు. అమాత్యగిరీ అవకాశం దక్కుతుందని ఆశపడ్డారు. కానీ సామాజిక సమీకరణాల లెక్కలు, జనసేనకు పదవులు కేటాయించాల్సి రావడంతో ఎవరికీ అవకాశం దక్కలేదు. దీంతో కీలకమైన నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం రావొచ్చేమోనని పలువురు భావిస్తున్నారు. ప్రధానంగా టీటీడీ బోర్డు సభ్యులు పదవులు, విప్, కీలకమైన కార్పొరేషన్లు, అసెంబ్లీ కమిటీల్లో చోటు ఉండొచ్చని భావిస్తున్నారు. అందులోభాగంగా ఇప్పటికే జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలతోపాటు సీటు కోల్పోయిన ఆశావహులు చంద్రబాబు, లోకేశ్‌ను తరచూ కలుస్తున్నారు. కొందరు అమరావతిలోనే మకాం వేసి పైరవీలు చేస్తున్నారు. మరోపక్క జిల్లాలో అత్యంత కీలకమైన డీసీసీబీ ఛైర్మన్ పోస్టుకు తెగ పోటీ పెరిగింది. ఓ సీనియర్ ఎమ్మెల్యే తనయుడుతోపాటు కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ నేతల నుంచి సైతం పైస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఈ రెండు వర్గాల నేతల తరపున కొందరు ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తున్నారు. ఇదిలాఉంటే పిఠాపురం నుంచి ఈ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయడంతో అక్కడున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మకు సీటు చేజారింది. ఈనేపథ్యంలో వర్మను పిలిపించుకుని మాట్లాడిన చంద్రబాబు పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేస్తానని బహిరంగంగా మాట ఇచ్చారు. క్షత్రియుల కోటాలో మంచి గుర్తింపునిస్తానని హామీ ఇచ్చారు. దీంతో చంద్రబాబు ఆదేశాల మేరకు పిఠాపురంలో పవన్‌కల్యాణ్ విజయం కోసం టీడీపీ తరపున వర్మ కుటుంబం సహా కష్టపడ్డారు. అనుకున్నట్టుగానే పవన్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. మరోపక్క పవన్ సైతం ఎన్నికల ప్రచార సభల్లో వర్మలాంటి నేత చట్టసభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో తనకు ఎలాగైనా పదవి లభిస్తుందని వర్మ ధీమాగా ఉన్నారు. ఇటీవల ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవుల్లో తనకు ఛాన్స్ ఉంటుందని భావించినా రెండేళ్లే వ్యవధి ఉండడంతో పార్టీ అధిష్ఠానం కూడా మాట్లాడలేదు. తనకు త్వరలో ఎమ్మెల్సీ ఖాయం అని వర్మ భావిస్తున్నారు. అటు జనసేన నుంచి కాకినాడ రూరల్, పిఠాపురం నుంచి ఆశావహులు అధికంగా ఉన్నారు. వీరిలో కొందరు డిప్యూటీ సీఎం పవన్‌ను కలిశారు. ఇటీవల తనను కలిసి కొందరు నేతలతో పనితీరు ఆధారంగా కట్టబెడతానని ప్రాధాన్యం ఇస్తానని పవన్ చెప్పారు.



కలెక్టరేట్‌లో ఓ వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 29: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలను తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీలపై ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఏపీ వెలుగు వీవోఏల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

'వెలుగు వీవోఏలపై వేధింపులు ఆపాలి'

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29: వెలుగు వీవోఏలపై రాజకీయ వేధింపులు అరికట్టి అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద యానిమేటర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరానికి డీఆర్డీఏ పీడీ రమణి హాజరై తన పరిధిలో ఉన్న సమస్యలు కూర్చుని పరిష్కరించుకుందామని, మిగిలినవి పైఅధికారులకు తెలియజేస్తామని యానిమేటర్లకు హామీ ఇచ్చారు. ముందుగా ధర్నాను ఉద్దేశిస్తూ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు బేబీరాణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మారింది కాబట్టి తమ కార్యకర్తలకు మీ స్థానంలో నియమిస్తామని, మీరు రాజీనామా చేయండని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు యానిమేటర్లపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబోస్ మృతదేహం



(ఫైల్‌ఫొటో)

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కాకినాడ క్రైం, జూలై 29: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. కాకినాడ రూరల్ మండలం, డ్రైవర్స్ కాలనీకి చెందిన రెడ్డి చంద్రబోస్ (37) అవివాహితుడు. అతనికి తండ్రి జోగారావు, తల్లి వరలక్ష్మి, సోదరి ఉన్నారు. జోగారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కొడుకును ఛార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) చదివిస్తున్నాడు. కుమార్తెకు వివాహమైంది. చంద్రబోస్ ఓపక్క సీఏ చదువుతూ మరోపక్క వలసపాకలలో ప్రైవేటుగా అకౌంటెంట్‌గా పనిచేస్తూ తండ్రికి సహాయకారిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో చంద్రబోస్ సోమవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని యాక్టీవా ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు పయనమయ్యాడు. చంద్రబోస్ భానుగుడి మీదుగా టూటౌన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందికి దిగుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న ఏలేశ్వరం డిపోకి చెందిన పల్లెవెలుగు బస్సు బలంగా ఢీ కొట్టింది. దాంతో చంద్రబోస్ ఎగిరిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే తనువు చాలించాడు. అనంతరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌నాయక్ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను వెంటనే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జూలై29: కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో దివ్యాంగుల వీల్‌చైర్, వినికిడి యంత్రాలు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న కాకినాడ అర్బన్‌కి చెందిన జొన్నాడ జోగేశ్వరస్వామి, మండపేట చెందిన కడారి మణిలకు వీల్‌చైర్లను అందించారు. అలాగే సత్యనారాయణ, దీప్తి లకు వినికిడి యంత్రాలను కలెక్టర్ ఆదేశాల ప్రకారం అందించామని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ తెలిపారు.



'సాగు' జోరుగా

ఇప్పటిదాకా 48,089 హెక్టార్లలో వరినాట్లు.. లక్ష్యంలో 50శాతంపైనే

విస్తారంగా కురిసిన వర్షాలతో సాగు వేగం.. ఆగస్టు తొలి వారానికి పూర్తి

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు కరుణించడంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు, కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో వరినాట్లు ఊపందుకున్నాయి. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 97,543 హెక్టార్లలో సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 48,089 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. జిల్లాలో ఉన్న 21 మండలాల్లో సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనిలో 20,724 హెక్టార్లలో నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేశారు. 11,847 హెక్టార్లలో లైన్ సోయింగ్ పద్ధతిలో సాగు చేశారు. 21 హెక్టార్లలో డ్రమ్ సీడర్ ద్వారా వరి నాట్లు వేశారు. 1479 హెక్టార్లలో నర్సరీలను అభివృద్ధి చేశారు. జిల్లాలో అత్యధికంగా సామర్లకోట మండలంలో 8,250 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. అలాగే పిఠాపురం మండలంలో 4,618 హెక్టార్లలలో, పెదపూడి మండలంలో 6300 హెక్టార్లలో, కరప మండలంలో 5,240 హెక్టార్లలో, తాళ్లరేవులో 2766 హెక్టార్లలో, కిర్లంపూడి మండలంలో 1796 హెక్టార్లలో, పెద్దాపురం మండలంలో 1933 హెక్టార్లలో, యూ.కొత్తపల్లి మండలంలో 2309 హెక్టార్లలో సాగు పనులు పూర్తి అయ్యాయి. అలాగే కోటనందూరులో 83 హెక్టార్లలో, తునిలో 301 హెక్టార్లలో, రౌతులపూడిలో 281 హెక్టార్లలో, శంఖవరంలో 60 హెక్టార్లలో, ఏలేశ్వరంలో 1233 హెక్టార్లలో, జగ్గంపేటలో 959 హెక్టార్లలో, ప్రత్తిపాడులో 449 హెక్టార్లలో, తొండంగిలో 526 హెక్టార్లలో, గొల్లప్రోలులో 1900 హెక్టార్లలో, గండేపల్లిలో 1754 హెక్టార్లలో, కాకినాడ రూరల్‌లో 577 హెక్టార్లలో, కాకినాడ అర్బన్‌లో 114 హెక్టార్లలో వరినాట్లు వేశారు.

విస్తారంగా వర్షాలు

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల వల్ల జిల్లాలో గత రెండు నెలలపాటు విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పైగా భూగర్భ జలాలు కూడా గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు ఏలేరు, పంపా నుంచి నీరు విడుదల అవ్వడంతో సాగు విస్తరించింది. వరినాట్లు నిర్దేశించిన సమయానికి పూర్తి అయితే అక్టోబర్ నెలకు రైతు చేతికి పంటలు అందుతాయని, తద్వారా నవంబరులో వచ్చే తుఫాన్ల నుంచి పంటను రక్షించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆగస్టు తొలివారానికి వరినాట్లు పూర్తి

జిల్లాలో ఖరీఫ్ వరి నాట్లు ఆగస్టు తొలి వారానికి నూరుశాతం పూర్తి అవుతాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన ఎరువులు 27 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచాం. జిల్లాలో అన్ని మండలాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడం వల్ల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే యాభై శాతంపైనే వరి నాట్లు వేశారు. ఈ ఖరీఫ్‌లో యాభై శాతం వరకు వెదజల్లే పద్ధతిలోనే రైతులు నాట్లు వేశారు. ప్రధానంగా స్వర్ణ, 1318 రకాల వరి విత్తనాలను రైతులు ఎక్కువగా నాటారు. వాతావరణం అనుకూలించడం వల్ల అధిక దిగుబడులు సాధించగలమనే ఆశాభావం వ్యక్తంచేస్తున్నాం.

- విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు



ఖరీఫ్ కళ

తిమ్మాపురంలో నాట్లు వేస్తున్న మహిళా రైతులు.. కాడెద్దులతో దుక్కు దున్నుతున్న దృశ్యం

కిర్లంపూడి, జూలై29: అల్పపీడనం వర్షాలతో మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కొంత ఆలస్యమైనా వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వరినారు సిద్ధంగా ఉండడంతో గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. కిర్లంపూడి మండలం భూపాలపట్నం, తిమ్మాపురం, తామరాడ, కిర్లంపూడి, చిల్లంగి, రాజుపాలెం గ్రామాల్లోని కురుస్తున్న వర్షాలకు పుష్కలంగా నీరు చేరడంతో రైతులు దమ్ము ప్రారంభించి వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఏలేరు కాలువల్లో పూర్తిస్థాయిలో నీరు విడుదల కావడంతో వ్యవసాయ పనులు మొదలెట్టారు. వర్షపునీటితోనే దమ్ములు చాలా వరకు పూర్తికావొచ్చంటున్నారు. అయితే ఏలేరు కాలువ వెంబడి నీరు రావడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా పంటలు పండించే అవకాశముందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు కూడా కళకళలాడడంతో రైతులు దమ్ములు చేయడం, వరినాట్లు వేయడం వంటి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. దీంతో ప్రస్తుతం అంతటా ఖరీఫ్ కళ కనిపిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ మొదట్లోనే వర్షాలు కురవడం దానికి తోడు ఏలేరు నిండుకుండలా మారడం, పుష్కర కాలువ నీరు ఏలేరుకు అనుసంధానం చేయడంతో సాగుకు ఏ ఇబ్బందీ లేదు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై29: ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు పటిష్టభద్రత ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును సోమవారం కలెక్టర్. రెవెన్యూ, అగ్నిమాపకశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్టు వెల్లడించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఈవీఎం, వీవీప్యాట్ గోదాములో భద్రపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ అర్బన్ తహశీల్దార్ చిన్నయదొర, డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

జిల్లాలో తహశీల్దార్లు రిలీవ్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29: జిల్లాలో 21 మంది తహశీల్దార్లను సోమవారం రిలీవ్ చేస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు ఇచ్చారు. వీరు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లాకు వచ్చి సార్వత్రిక ఎన్నికల విధులను నిర్వహించారు. వీరు మరో రెండు రోజుల్లో ఆయా జిల్లా కలెక్టర్లకు రిపోర్టు చేసి కేటాయించిన విధుల్లో చేరతారు. అదేవిధంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాకినాడ జిల్లా నుంచి 18 మంది తహశీల్దార్లు ఉమ్మడి కృష్ణా జిల్లా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు వెళ్లారు. అక్కడ వారు రిలీవ్ అవ్వడంతో మంగళ, లేదా బుధవారాల్లో కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయనున్నారు. వీరికి కలెక్టర్ పోస్టింగ్‌లు కేటాయిస్తారు.

ఇక నుంచి రేషన్‌లో రాగులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29: జిల్లాలో రేషన్‌కార్డుదారులకు రాగులు కూడా ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 70 టన్నుల రాగులను పౌరసరఫరాలశాఖ సిద్ధంచేసింది. ఒక్కొక్క రేషన్ కార్డుకి మూడు కిలోల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. ఒక రేషన్‌కార్డులో ముగ్గురు సభ్యులుంటే 12 కిలోల బియ్యం, 3 కిలోల రాగులు చొప్పున ఇస్తారు. రాగులను కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని పట్టణాలు, ఏలేశ్వరం టౌన్ ప్రాంతాల్లో ఉన్న డీలర్ల ద్వారా అందజేస్తున్నారు. జిల్లాలో ఉన్న రాగుల డిమాండ్‌ను అనుసరించి మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు.




అనంతలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీటం

వచ్చేనెల 6న సమర్పణ

అన్నవరం, జూలై 29:
కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం సత్యదేవుడు వజ్రకిరీటధారియై భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణకు వజ్ర కిరీటం, స్వామి, అమ్మవార్లు ఇద్దరికీ వజ్ర కర్ణాభరణాలను లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించారు. కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో రూ.2కోట్లతో వీటిని తీర్చిదిద్దినట్టు అధికారులు తెలిపారు. వాటిని స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 6న దాత సమర్పిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు. సత్యదేవుడి ధ్వజస్తంభం బంగారు పూత కార్యక్రమాన్ని కూడా అదే రోజు ఏర్పాటు చేస్తే బాగుంటుందని నెల్లూరుకు చెందిన దాతకు దేవస్థానం అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే దేవదాయ శాఖ మంత్రి ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్టు దాత చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం

రూ.1.27 కోట్లు

30 రోజులకు వచ్చిన మొత్తమిది

175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి

అన్నవరం, జూలై 29:
రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్‌బాబు పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజులకు రూ.1,27,20,345 నగదు, 175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి లభించాయి. యుఎస్‌ఏ 332 డాలర్లు, కువైట్ 26 దిరహమ్స్, న్యూజిలాండ్ 40 డాలర్లతో పాటు పలు దేశాల కరెన్సీ వచ్చాయి. లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు



- ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జూలై 29: జేఎన్టీయూకే పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్, పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూసీఈకే విభాగం గణిత ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్‌ను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన గతంలో అడ్మిషన్స్ డైరెక్టరుగాను, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గాను పనిచేశారు. సివిల్ ప్రొఫెసర్ ఏసురత్నాన్ని ఇన్‌చార్జి డీఏఏగాను, యూసీఈకే భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.పద్మజారాణిని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ)గాను బదిలీ చేశారు. ఇప్పటివరకు డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ బి.బాలకృష్ణను ఇన్‌చార్జి డీఏపీగాను, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ స్వర్ణకుమారిని ఎఫ్‌యూఏఆర్ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, ప్రొఫెసర్ ఎన్.బాలాజీని లీగల్, ప్రభుత్వ వ్యవహారాల ఇన్‌చార్జి డైరెక్టరుగాను, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్‌ను ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, కె.పద్మప్రియను ఫార్మసీ కోర్సుల ప్రత్యేకాధికారిగాను నియమించారు. అలూమ్ని రిలేషన్స్ అధికారిగా పనిచేసిన ఎస్.మోహన్‌రావును యూసీఈకే ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ దీక్షితులును గణిత విభాగాధిపతిగా, రసాయన శాస్త్రం విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.సత్యవేణిని భౌతిక శాస్త్రం విభాగాధిపతిగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియామకమైన రవీంద్రనాథ్‌ను, ఇన్‌చార్జి డైరెక్టర్లను ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పిల్లల అక్రమ రవాణా అడ్డగింత

ఆర్పీఎఫ్ పోలీసులకు డీఆర్ఎం ప్రశంసలు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) పోలీసులను రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ప్రశంసించారు. ఈ నెల 27న రాజమహేంద్రవరం-తుని స్టేషన్ల నడుమ ఆర్పీఎఫ్, ఏపీవీ బచ్‌పన్ బచావో ఆందోళన్ (ఆంధ్రప్రదేశ్) సిబ్బంది సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు చేశారు. ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 8 మంది బాలలను గుర్తించారు. వారు మరో నలుగురు గుర్తు తెలియని పెద్ద వారితో కలిసి వెళ్తున్నారు. ప్రయాణానికి కారణాలను బాలలు సరిగా వెల్లడించలేకపోవడంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దింప విచారించారు. విజయవాడ, చెన్నై, తిరుప్పూర్‌తో పాటు కేరళలోని వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులుగా పని చేయించుకోడానికి తీసుకెళ్తున్నారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. బాలలను బాలల సంక్షేమ సమితికి అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది. సమయానికి స్పందించి బాలలను కాపాడడంలో చొరవ చూపిన సీనియర్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, ఆర్పీఎఫ్ రాజమండ్రి పోస్ట్ కమాండర్ సైదయ్య తదితరులను డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సామర్లకోట, జూలై 29: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం కుమ్మరి వీధికి చెందిన పెదపూడి వెంకటరమణ ఒక్కడే తాటాకు పాకలో ఉంటూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి, సోదరులు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు.



మద్యానికి బానిసైన వెంకటరమణ తన పరిసరాల్లో అందరితోనూ గొడవపడుతూ, దుర్భాషలాడుతూ ఉంటాడు. ఆదివారం రాత్రి కుమ్మరి వీధికి చెందిన కొందరు వ్యక్తులతో వివాదాలకు దిగిన వెంకటరమణను చితక్కొట్టినట్టు సమాచారం. అందుకు సాక్ష్యంగా మృతుడు ధరించిన వస్త్రాలకు బురద అంటుకుని ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాత్రి వివాదం అనంతరం ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. సోమవారం ఉదయం ఇరుపక్కల వారు చూసేసరికి వెంకటరమణ చనిపోయి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి సామర్లకోట సీఐ సురేష్ తదితర పోలీసులు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేశారు. కాగా గత రాత్రి వెంకటరమణతో వివాదానికి దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.


మంగ మృతదేహం

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

జగ్గంపేట, జూలై 29:
కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన కింతాడ మంగ (40) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆమె తన ఇంటి వద్ద నీళ్లు పట్టేందుకు మోటారు వైర్లను ప్లగ్‌లో పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో కుప్పకూలి మృతి చెందినట్టు ఆమె భర్త తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్లికాగా రెండో అమ్మాయికి పెళ్లి కావాల్సి ఉంది. ఈ ఘటనపై జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద

తగ్గుతున్న వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద 14.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- 13,92,438 క్యూసెక్కులు సముద్రంలోకి
- భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ

ధవళేశ్వరం, జూలై 29: గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం వద్ద 12 గంటల వ్యవధిలో అడుగు మేర తగ్గింది. ఇదే ఒరవడి కొనసాగితే మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చు. ఆదివారం రాత్రి 8గంటలకు 15.80 అడుగుల వరకు నీటిమట్టం పెరిగింది. ఈ సమయంలో అత్యధికంగా 16,09,099 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. 8 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున తగ్గుముఖం పట్టింది. క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 7గంటలకు 14.60 అడుగులకు చేరింది. ఎగువన భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ ఆదివారం రాత్రి 10గంటలకు 47.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సోమవారం రాత్రికి నీటిమట్టం 42.8 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు తగ్గాయి. సోమవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 10.04 మీటర్లు, పేరూరు వద్ద 15.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.44 మీటర్లు, భద్రాచలం వద్ద 43 అడుగులు, కూనవరం వద్ద 20.66 మీటర్లు, కుంట వద్ద 12.18 మీటర్లు, పోలవరం వద్ద 13.36 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.99 మీటర్లు నమోదయ్యాయి.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేత

మోతుగూడెం, జూలై 29: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ బాలకృష్ణ మాట్లాడుతూ గత రెండు రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో వలసగెడ్డ, పాలగెడ్డ, వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ తగ్గాయన్నారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో డొంకరాయి నీటిమట్టం 1034.10అడుగులకు తగ్గిందన్నారు. దీంతో అప్పటివరకు నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న 13,124 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లను పూర్తిగా మూసివేసి మరో రెండు గేట్ల ద్వారా 4,258 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగించారు. ఉదయం 11 గంటలకు నీటిమట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా ఉండడంతో మిగతా రెండు గేట్లను కూడా పూర్తిగా మూసివేసి నీటి విడుదలను నిలిపివేశామని ఈఈ తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం పవర్ కెనాల్ ద్వారా 3వేల క్యూసెక్కులు డొంకరాయి విద్యుత్ సరఫరా అనంతరం విడుదలవుతుందన్నారు. డొంకరాయి జలాశయంలో 12.398 టీఎంసీల



నీటి నిల్వలు ఉన్నాయని ఈఈ విజయ్‌కుమార్ వివరించారు.


తెల్లవార్లూ తాటిచెట్టుపై ఉన్న నవీన్

నిద్రమత్తులో వరద నీటిలోకి



- నిండా మునిగిన టిప్పర్
- తెల్లవార్లూ తాటిచెట్టుపైనే డ్రైవర్ నవీన్
- ఉదయం గమనించి ఒడ్డుకు చేర్చిన జాలర్లు

చింతూరు, జూలై 29: ఓ టిప్పర్ డ్రైవర్ తెల్లవార్లూ తాటి చెట్టుపై ఉండి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన డ్రైవర్ మర్రి నవీన్ టిప్పర్‌పై ఆదివారం ఒడిసాలోని జర్సిగూడ బయల్దేరాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వచ్చేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. చింతూరు-కుయుగూరు మధ్య 326వ జాతీయ రహదారిపై వరద నీరు ఉన్న విషయాన్ని నిద్ర మత్తులో గమనించని నవీన్ ముందుకెళ్లాడు. దీంతో టిప్పర్ వరద నీటిలో మునిగింది. నిద్రమత్తు వీడిన అతడు టిప్పర్ క్యాబిన్ నుంచి కష్టంమీద బయటకొచ్చి ఈదుకుంటూ దగ్గర్లో ఉన్న తాటిచెట్టు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఎటు వెళ్తే ఒడ్డుకు చేరతాడో అర్థం కాక తెల్లవార్లూ తాటిచెట్టుపైనే ఉన్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో వరద విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన జాలర్లను చూసి నవీన్ కాపాడండి అంటూ కేకలు వేశాడు. దీనిని గమనించిన జాలర్లు వచ్చి అతడిని బోటులో ఒడ్డుకు చేర్చారు.

వరద సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలి

ప్రతీ బాధిత కుటుంబానికీ రూ.3వేలు అందించాలి

టెలి కాన్ఫరెన్స్‌లో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు జూలై 29: గోదావరి వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.3వేల సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాల వారికి సాయం అందాలని ఆదేశించారు. సాయం అందలేదని ఫిర్యాదు రాకూడదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధు లు, గ్రామ స్థాయి కమిటీ సభ్యుల సమక్షంలో నగదు పంపిణీ జరగాలన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. తొలుత కూనవరం, వీఆర్ పురం మండలాల్లో, తర్వాత ఎటపాక, చింతూరు మండలాల్లో వరద బాధితులకు సాయం పంపిణీ చేయాలని ఆదేశించారు.



చోరీ ఘటనను వివరిస్తున్న సీఐ శేఖర్‌బాబు, చోరీకి గురైన వస్తువులను మీడియాకు చూపిస్తున్న దృశ్యం

కుటుంబ సభ్యుడే సూత్రధారి


- చెడు వ్యసనాలకు బానిసై నగదు, నగలు అపహరణ
- ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో చోరీ ఘటనలో బీటెక్ విద్యార్థితో పాటు మరో నలుగురు అరెస్టు
- పదహారున్నర కాసులు బంగారం, రూ.2.50లక్షల నగదు రికవరీ

ప్రత్తిపాడు, జూలై 29: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్య ఉద్యోగి ఇంట్లో జరిగిన చోరీ ఘటనలో కుటుంబ సభ్యుడే సూత్రధారి అయి నగదు, నగలు అపహరణలో కీలకమయ్యాడు. ఈ ఘటనలో పదహారున్నర కాసుల బంగారం, రూ.2.50 లక్షల నగదు స్వాధీనపరుచుకుని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం సీఐ ఎం.శేఖర్‌బాబు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసముం టున్న వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి ఇంట్లో ఈ నెల 25వ తేదీన చోరీ జరిగింది. ఇరవైరెండున్నర కాసుల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణకు గురైనట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రధాన సూత్రధారిగా వైద్య ఉద్యోగి అన్న కొడుకు మచ్చికర్ల సాయిచరణ్‌ను పోలీసులు గుర్తించారు. వ్యసనాలకు బానిసైన అతడు ఈ చోరీకి మాస్టర్ ప్లాన్ వేశాడు. అతనికి స్నేహితులు అనుగుల అజయ్, వలసాని ధనుష్, సత్యసాయి, బన్ని సహకరించారు. సాయికిరణ్ తరుచూ ఇంటికి వచ్చి తాళాలు భద్రపరిచే చోటును గమనించి స్నేహితుల సహాయంతో ఇంట్లోకి చొరబడి నగదు, నగలు అపహరించుకుపోయాడు. వీటిని కాకినాడలో సాయిచరణ్ స్నేహితుడు బన్ని వద్ద భద్రపరిచారు. నిందితులను విచారించగా దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు, పదహారు కాసులు బంగారం స్వాధీనం చేసుకుని సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్ బాబు కోరారు. యువత సన్మార్గంలో నడిచేందుకు తల్లిదండ్రుల అజమాయిషీ కూడా ఉండాలన్నారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో దొంగతనాల నివారణకు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశామని చెప్పారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఐదు గురిలో ముగ్గురు యువకులను సోమవారం అరెస్టు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... ఏజెన్సీలోని రంపచోడవరం ప్రాంతానికి చెందిన పండు (టామ్) గంజాయిని తీసుకొచ్చి నగరంలోని వీరభద్రా నగర్‌కి చెందిన జలగడుగుల నరేంద్రకు రంపచోడవరంలో విక్రయిస్తాడు. అతడి వద్ద నుంచి తాడితోట రెల్లివీధికి చెందిన ధనాల భవానీశంకర్, షెల్టాన్ హోటల్ సమీపంలోని వీరభద్రాపురానికి చెందిన బాదంపూడి శ్యాం దుర్గాప్రసాద్, గోరక్షణపేటకు చెందిన రొడ్డా రాకేశ్ కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో గోదావరి గట్టున ఉమామార్కండేయ స్వామి గుడి సమీపంలోని పిండాల రేవులో గంజాయి కలిగి ఉండడంతో పాటు విక్రయాలు జరుపుతున్న నరేంద్ర, భవానీశంకర్, దుర్గాప్రసాద్‌లను వన్‌టౌన్ ఎస్ఐ ఎం.కేశవరావు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పండు, రాకేశ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నారు. గంజాయి వాడకం, విక్రయం, నిల్వ, రవాణాపై ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ చెప్పారు. గంజాయి బ్యాచ్‌ను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కేశవరావు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

గంజాయితో బాలుడి అరెస్టు

తుని రూరల్, జూలై 29: తుని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయితో ఓ బాలుడు పట్టుబడినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన ఆ బాలుడు రైలు మార్గాన తుని చేరుకుని అక్కడి నుంచి నర్సీపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేశాడన్నారు. 4.900 కిలోల గంజాయితో తుని చేరుకుని రైలు ఎక్కే క్రమంలో పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా గంజాయి తరలింపులో సూత్రధారులుగా ఉన్న మరో ఇద్దరు పేర్లు వెల్లడించాడు. వారిద్దరూ అనంతపురానికి చెందిన వారే అని, పట్టుకునేందుకు ఒక బృందం అక్కడకు వెళ్లారని సీఐ చెప్పారు.


అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చట్టి గ్రామంలో తలదాచుకునేందుకు వరద బాధితులు వేసుకున్న గుడారాలు

ఇంకా వరద నీటిలోనే

అంధకారంలో 76 ఆవాసాలు

49 రహదారులు మూసివేత

కొనసాగుతున్న సహాయక చర్యలు

చింతూరు, జూలై 29: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని లోతట్టు గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. సోమవారం భద్రాచలం వద్ద గోదావరి 43.20 అడుగుల మేర ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. వరద ఉధృతి తగ్గుతున్నా గ్రామాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. చట్టి గ్రామంలో వరద బాధితులు తాత్కాలికంగా ఉండేందుకు గుడారాలు వేసుకున్నారు. డివిజన్ పరిధిలోని 121 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా సోమవారం సాయంత్రం 45 ఆవాసాలకు పునరుద్ధరించారు. మిగిలిన 76 ఆవాసాలు అంధకారంలో మగ్గుతున్నాయి. వరద నీటిలో వున్న 49 ప్రధాన రహదారులపై రాకపోకలను నిలిపివేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

శెభాష్ సత్తిబాబు

- వాగు దాటి విధులు నిర్వర్తించిన లైన్‌మన్
- అభినందించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



రౌతులపూడి, జూలై 29: కాకినాడ జిల్లా జగ్గంపేట డివిజన్ రౌతులపూడి సెక్షన్ గుమ్మరేగుల పరిధిలోని కొట్టాం 11 కేవీ ఫీడర్ కొద్ది రోజులుగా తరచూ బ్రేక్‌డౌన్ అవుతోంది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలపై పడడంతో అస్తమానూ సరఫరా నిలిచిపోతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కూడా ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి బ్రేక్‌డౌన్ అయ్యింది. ఇటీవలి భారీ వర్షాలకు గుమ్మరేగుల ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కాలువ దాటి వెళ్తే తప్ప విద్యుత్ సమస్య పరిష్కారం కాదు. లైన్‌మన్ కారం సత్తిబాబు నడుముకు తాడు కట్టుకుని వైర్లపైపడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది. దానిని చూసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన లైన్‌మన్ సత్తిబాబును ప్రశంసించారు.

కాకినాడ

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

గండేపల్లి, జూలై 29: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని గుర్తించినట్లు గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. వారిని సోమవారం పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా జడ్జి జి.హర్షవర్ధన్ ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే పంతం నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 29: ఎన్నికల వరకే రాజకీయాలు అని తర్వాత పార్టీలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అంతా కలసి పనిచేద్దామంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. సోమవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి విరీష ఆధ్వర్యంలో నిర్వహించిన మండల పరిషత్తు సర్వసభ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధిక గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, పలు రకాల రంగుల్లో నీరు సరఫరా అవుతుందన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేసిస్తే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ద్వారా జలజీవన్ పథకంలో నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పంటపొలాలకు సక్రమ నీటి పారుదలకోసం డ్రైన్లపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగింపునకు చర్యలు చేపట్టాలని డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శ్మశాన వాటికల కొరత ఉందని పెద్ద లేఅవుట్లకు అనుమతుల జారీలో వీటికి స్థలం కేటాయింపు చేసేలాఆలోచన చేయాలన్నారు. వర్షాకాలంలో డయేరియా, విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా మెరుగైన శానిటేషన్, ఆరోగ్య సేవలు అందించాలని పంచాయతీ, వైద్యులకు సూచించారు. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, నీటి పారుదల, డ్రైనేజీ, వైద్యం, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, మత్స్యశాఖ తదితరశాఖలపై సమీక్షించి సూచనలు చేశారు. డీఆర్‌డీఏ పీడీ పనితీరు బాగోలేదని, ఫోన్ చేసినా స్పందించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహశీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. మండల సమావేశానికి ముఖ్యఅతిథిగా తొలిసారిగా విచ్చేసిన ఎమ్మెల్యే నానాజీని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు ఘనంగా సత్కరించారు.

ఫ్రూట్స్, స్నాక్స్ అందజేత

గొల్లప్రోలు రూరల్, జూలై 29: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనల మేరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడిభోజన పథకంగా మార్పు చేసిన శుభసందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జనసైనికుడు ఓదూరి కిషోర్ ఫ్రూట్స్, స్నాక్స్ అందజేశారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ

తుని రూరల్, జూలై 29: ప్రతిఒక్కరూ సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలని టీడీపీ నాయకుడు డి.పోలవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పలకా సోమేశ్వరరావు స్పష్టం చేశారు. డి.పోలవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం, అరటిపండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

'సమస్యను నివేదించాం'

గొల్లప్రోలు, జూలై 29: గొల్లప్రోలు కరణంగారితోట నూకాలమ్మ గుడి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్వహణపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆ ప్రాంతాన్ని సోమవారం సందర్శించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామని, వారు నిర్ణయం తీసుకుంటారని సీఐ చెప్పారు. అనుమతులు లేకుండా చర్చి నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి వెళ్లిన పట్టణవాసులపై గొల్లప్రోలు తహసీల్దారు ఉదయభాస్కర్ చిందులు తొక్కుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు తీరుపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

'మహిళలపై దాడులను అరికట్టాలి'

తాళ్లరేవు, జూలై 29: మహిళలపై జరుగుతున్న దాడులను చట్టాల ద్వారా అరికట్టాలని సీడీపీవో మాధవి అన్నారు. తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో మహిళల రక్షణ చట్టాలపై మహిళా మండలి అధ్యక్షురాలు నందివర్ధన అధ్యక్షతన సోమవారం అవగాహన కల్పించారు.

ముగ్గురు యువకులకు జరిమానా

తుని రూరల్, జూలై 29: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు యువకులను తుని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రూ.10వేల చొప్పున ముగ్గురికి రూ.30వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఐటీ అధికారుల అవగాహన సదస్సు

తుని రూరల్, జూలై 29: పన్ను చెల్లింపుదారులు తప్పుడు క్లెయిమ్‌లు చేయరాదని,నిబంధనల మేరకు ఐటీఆర్ ఫైలింగ్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ అధికారి కె.భాస్కరరావు సూచించారు. సోమవారం ఆదాయ పన్నుశాఖ అధికారులు జడ్పీ గర్ల్స్‌హైస్కూల్లో ఉపాధ్యాయులకు, ఐటీఆర్ ఫైలింగ్ ట్యాక్స్ చెల్లింపుదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

తుమ్మలపల్లి పరామర్శలు

జగ్గంపేట/గండేపల్లి/కిర్లంపూడి, జూలై 29: జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సోమవారం పలువురిని పరామర్శించారు. గండేపల్లి మండలంలోని ఉప్పలపాడుకు చెందిన తోటకూర వెంకన్న మృతితో వారి కుటుంబాన్ని పరామర్శించారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన తోట సాయిబాబా మరణించడంతో వారి కుటుంబాన్ని తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి సానుభూతి తెలిపారు. కిర్లంపూడిలో ముద్రగడ చిన్నబాబు మామయ్య ఇటీవల మరణించగావారికుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మరిసే రామకృష్ణ, పులి ప్రసాద్, సూరపురెడ్డి నరేష్, సోమరాజు, మండపాక శ్రీరామ్ ఉన్నారు. మాదారపు వీరబాబు, శ్రీను, దినేష్, మాదారపు వీరబాబు ఉన్నారు.

యనమలను కలిసిన వనమాడి

తుని రూరల్, జూలై 29: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని తేటగుంట టీడీపీ కార్యాలయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై వనమాడి ఆయనతో చర్చించారు. టీడీపీ యువనేత యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, అంకంరెడ్డి రమేష్ ఉన్నారు.

యనమల, కొండబాబు పరామర్శ

తొండంగి, జూలై 29: ఇటీవల మృతిచెందిన జీఎంపేట మాజీ సర్పంచ్ కోడ బంగారమ్మ కుటుంబాన్ని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పరామర్శించారు. ఎల్లయ్యపేటలో బంగారమ్మ కుమారుడు టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణను సోమవారం వారు పరామర్శించారు. వారివెంట యనమల రాజేష్‌చొక్కా అప్పారావు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్ ఉన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో వనమహోత్సవం

సామర్లకోట, జూలై 29: పట్టణంలో పలు విద్యాసంస్థల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు. ప్రతిభ విద్యాసంస్థల ఆవరణలో లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మెడికల్ ఎయిడ్ స్కీమ్‌పై విస్తృత ప్రచారం

జీజీహెచ్(కాకినాడ), జూలై 29: జిల్లాలో డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్ మార్పు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. కాకినాడలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ప్రోగ్రామ్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 3లక్షల ఆదాయం మించని వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వ్యాధిగ్రస్తులు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిడ్నీ, గుండె, కాలేయం, మెదడు, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల కోసం వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు.

'నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి'

తుని రూరల్, జూలై 29: విద్యార్థులు విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని శ్రీప్రకాష్‌లో జరిగిన స్కూల్ కెప్టెన్, హౌస్‌కెప్టెన్ ప్రమాణస్వీకారంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు నిర్వహించి మార్చ్‌ఫాస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించి నాయకులుగా ఎంపికైన విద్యార్థులతో నాయకత్వ లక్షణాలు సక్రమంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

నైపుణ్య సర్టిఫికెట్ల అందజేత

మూలపేట(కొత్తపల్లి), జూలై 29: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని లైఫియస్ ఫార్మా లిమిటెడ్ హెచ్ఆర్ టీవీ సాంబశివరావు అన్నారు. సెజ్ మూలపేటలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రతిభ కేంద్రాల ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న 54మంది యువతులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు.

స్వచ్ఛతా వారోత్సవాలు

తొండంగి, జూలై 29: పెరుమాళ్లపురం పంచాయతీలో స్వచ్ఛతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛభారత్ స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా సోమవారం అరబిందో ఫౌండేషన్ సహకారంతో పలు కార్యక్రమాలు చేపట్టారు.

సమస్యలు సత్వరం పరిష్కరించండి: కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 29: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా ఉన్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతిఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 17మంది సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఈలు పి.సత్యకుమారి, వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్ పాల్గొన్నారు.

'గ్రామాల రికార్డులు కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావాలి'

కార్పొరేషన్(కాకినాడ), జూలై 29: గత గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆర్డినెన్స్ ప్రకారం విలీనమైన ఆరు అర్బన్ గ్రామాల రికార్డులు కాకినాడ నగరపాలక సంస్థ అజమాయిషీలో ఉండాలని, 2017 కాకినాడ ఎన్నికల ముందు వాటిని వెనక్కి ఇవ్వడంవల్ల మరో రెండు గ్రామాలు సాంకేతిక సమస్యతో 42, 48 డివిజన్లలో స్థానిక పాలన నిలిచిపోయిందని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. కాకినాడ జవహర్‌వీధిలోని వివేక్‌భవన్‌లో పౌరసంఘం ప్రతినిధుల సమావేశం సోమవారం జరిగింది. పౌరసంఘం కన్వీనర్ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థ తక్షణమే గవర్నర్ ఆర్డినెన్స్ ప్రకారం ఆరు గ్రామాల విలీనానికి చెందిన పంచాయతీ రికార్డులు కార్పొరేషన్ స్వాధీనంలో ఉంచాలన్నారు. సమావేశంలో పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్‌కుమార్, జుత్తుక రమణ, మేడిశెట్టి వెంకటరమణ, సలాది శ్రీనివాస్ ఉన్నారు.

అడ్డుకొండ భూమికి పట్టాలు ఇవ్వాలి: కర్నాకుల

జగ్గంపేట, జూలై 29: మల్లిసాల, కె.గోపాలపురం గ్రామాల మధ్యలో సర్వే నెంబర్ 353 లోఉన్న 500 ఎకరాల పోరంబోకులో ఉన్న అడ్డుకొండ భూమిని నిరుపేదలకు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం సోమవారం ధర్నా చేసింది. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘ నేత కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. 40ఏళ్లుగా ఈ భూమి కోసం పోరాటాలు సాగుతున్నాయన్నారు.ఏలేటి కుటుంబీకులు ఈ భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నారన్నారు. కోర్టు కూడా పోరంబోకుభూమిగా గుర్తించిందన్నారు. ఎమ్మెల్యే స్పందించి పేదలకు న్యాయం చేయాలన్నారు.

అధికారులతో యనమల సమీక్ష

తుని రూరల్, జూలై 29: 2024-25 ఆర్థిక సంవత్సరంలో తుని నియోజకవర్గంలో పనుల ప్రణాళిక, ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు సమీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.15కోట్ల పన్నుల ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, సుర్ల లోవరాజు, గాడి రాజిబాబు ఉన్నారు.

పారిశుధ్య సేవలు మెరుగుపరచండి: కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 29: పారిశుధ్య సేవలు మరింత మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 5.30గంటల నుంచి మస్తరు కేంద్రాలను సందర్శించి కార్మికుల ముఖ ఆధారిత హాజరును తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. తనిఖీల్లో భాగంగా 13వ సర్కిల్ పరిధిలోని శారదాదేవి ఆలయం, 8వ సర్కిల్ పరిధిలోని పైడా సత్రంవద్ద ఉన్న మస్తరు కేంద్రాలను, పదో సర్కిల్ పరిధిలోని మెజిస్టిక్ వీధి ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజరు ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.30వేలు అందజేత

సామర్లకోట, జూలై 29: సామర్లకోట భీమేశ్వరాలయంలో దేవదాయశాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాత సామర్లకోటకు చెందిన చుక్క మోహనసాయికృష్ణ రూ.30వేల విరాళాన్ని చెక్ రూపంలో సోమవారం అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ మర్యాదలతో స్వామివారి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేసి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భీమేశ్వరస్వామికి విశేష అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు.

సర్పంచ్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

సామర్లకోట, జూలై 29: సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం సర్పంచ్ మోర్త పూర్ణిమ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరామర్శించారు. సర్పంచ్ పూర్ణిమ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ రెండురోజులక్రితం మృతిచెందారు. రాజప్ప వీకే రాయపురంలోని ఆమె ఇంటికి చేరుకుని సర్పంచ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. సర్పంచ్ కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉపసర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రానారాయణస్వామి (రాజు), మలిరెడ్డి ప్రసాదరావు, గంగాబత్తుల బాబలు, కింతల విజయ ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో పరిష్కారవేదిక

సామర్లకోట, జూలై 29: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో సోమవారం సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, డ్రైన్లు సమస్యలకు సంబంధించి పది అర్జీలు అందజేశారు. మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ పాల్గొన్నారు.

38ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

పిఠాపురం, జూలై 29: పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాలు వేదికగా కలుసుకున్నారు. 95మంది పూర్వ విద్యార్థులు ఈ అపూర్వ కలయికకు హాజరయ్యారు. విద్యాదాత పిఠాపురం మహారాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాడు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థి బోడా గణేష్ ప్రస్తుత విద్యార్థులకు గ్రామర్ పుస్తకాలు, డిక్షనరీలు అందజేశారు. పూర్వవిద్యార్థుల్లో కోకోకోలా కంపెనీ అసోసియేట్ కేవీ చలపతి, పీజీటీ బావిశెట్టి లక్ష్మీనారాయణ, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ షరీఫ్, తుని ఏఎస్ఐ నరసింహరావు, న్యాయవాదులు బొల్లోజు రాజా, పితాని వెంకటేశ్వరరావు, ఆటోమొబైల్ సెక్టార్ జీఎం త్రిపురారి సత్యనారాయణ, కందాల శ్రీరాం, మారిశెట్టి శ్రీనివాసరావు, కాకర్ల శ్రీరామశర్మ, వంపోలు పద్మరాజు, రాజపూడి వీరభద్రరావు పాల్గొన్నారు.

21ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

ఏలేశ్వరం, జూలై 29: పట్టణంలో 21ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 2003-2005 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు కలిశారు. 21ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు పలకరించుకుంటూ, కరచాలనం చేసుకుంటూ అధ్యాపకుల మందలింపులను గుర్తు తెచ్చుకొని సరదాగా గడిపారు. తమ అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో పలివెల శివాజీ, వాగు మాధవ్, పిట్టా విజయ్, తోటకుర నాగేంద్ర, చరణ్, తులసి వేణి, సామంతుల రవి, ప్రశాంత్, చందన, ప్రవీణ పాల్గొన్నారు.

దేవరపల్లిలో వర్మకు ఘనసత్కారం

పిఠాపురం, జూలై 29: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి అత్యధిక మెజార్టీతో గెలవడంతో కీలకపాత్ర పోషించడమే గాక తన ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జనసైనికులు ఘనంగా సత్కరించారు. గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, గంధం అయ్యప్ప ఆధ్వర్యంలో వర్మకు ఘనస్వాగతం పలికి 14 కిలోమీటర్ల మేర ప్రదర్శనగా తీసుకువెళ్లారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, జూలై 29: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ స్టూడెంట్స్ కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి సోమవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన కిట్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఎంపీపీ పెంకే సత్యవతి, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు ప్రభాకరశర్మ, వీఆర్‌కే చౌదరి, భవిత కేంద్రం నిర్వాహకులు దుర్గాప్రసాద్, ఆనందరావు పాల్గొన్నారు.

వేములపాలెంలో తాటాకిళ్లు దగ్ధం

ప్రత్తిపాడు, జూలై 29: ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం గ్రామ పంచాయతీ శివారు గ్రామం వేములపాలెంలో సోమవారం తెల్లవారుజామున తాటాకిళ్లు, మరో మూడు పాకలు అగ్నిప్రమాదానికి గురై దగ్ధమయ్యాయి. వేములపాలేనికి చెందిన దిడ్డి రాజబాబు తాటాకిల్లు, దిడ్డి చిన వెంకటరమణ, దిడ్డి రామ త్రినాథ్‌లు, కొండి లోవలకు చెందిన మరో మూడు తాటాకు పాకలకు సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. బాధితులంతా నిద్రలేచి చూసేటప్పటికే కళ్లెదుటే కాలి బూడిదయ్యాయి. 30 ఎరువుల బస్తాలు, 40 ధాన్యం బస్తాలు, మరో 30 పశుగ్రాస బస్తాలు మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా. బాధితులను గోకవరం సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి సభ్యులు లొండా లోవరాజు పరామర్శించారు.

'సబ్‌ప్లాన్ ఏజెన్సీకి ఐటీడీఏ ఏర్పాటు చేయాలి'

ప్రత్తిపాడు, జూలై 29: ప్రత్తిపాడులో సబ్‌ప్లాన్ ఏజెన్సీకి ఐటీడీఏ ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏగుపాటి అర్జునరావు డిమాండ్ చేశారు. లిబరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఏరియా కమిటీ అధ్యక్షుడు మానుకొండ లచ్చబాబు అధ్యక్షత వహించారు. అర్జునరావు మాట్లాడుతూ అధికారులు స్పందించి సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు ఐటీడీఏ పథకాలు కల్పించాలని కోరారు. లిబరేషన్ జాతీయ నేత చారుమజుందార్ 52వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజనసంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం సహాయ కార్యదర్శి రాజాల రత్నం, సుంకర రాజు, కామరాజు, అనుసూరి లక్ష్మి పాల్గొన్నారు.

అనధికారిక ఆర్ఎంపీ క్లినిక్స్‌పై దాడులు

జీజీహెచ్(కాకినాడ), జూలై 29: జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్స్ అధికారులు కన్నెర్ర చేశారు. వీటిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశాల మేరకు సోమవారం కాకినాడ సిటీలో పలు ఆర్ఎంపీ క్లినిక్స్‌పై డిప్యూటీ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఎం.పాండు రంగాప్రసాద్, ఏడీ సీహెచ్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్ డీపీఎం డాక్టర్ బి.సురేఖ, డిప్యూటీ ఎస్‌వో వైద్యఆరోగ్యశాఖ జి.గిరిగణేష్, పోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్ పి.ఉమామహేశ్వరరావు బృందం ఆధ్వర్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సిటీ పరిధిలోని 3 క్లినిక్స్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా అనుబంధంగా ఉన్న మెడికల్ దుకాణాలపై తనిఖీలు చేశారు. దుమ్ములపేటలో శివ క్లినిక్, సంజయ్‌నగర్‌లో శ్రీకృష్ణ వేణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, డెయిరీఫారం సెంటర్‌లో శ్రీవిజయ దుర్గ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లతోపాటు అనుబంధంగా ఉన్న మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేశారు.

'అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలి'

సర్పవరం జంక్షన్, జూలై 29: కాకినాడ రూరల్ మండలం పండూరు, తూరంగి, తిమ్మాపురం, సూర్యారావుపేట గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలు, అనధికారిక భవన నిర్మాణాలపై విచారణ నిర్వహించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పార్టీనాయకులు కంచుమర్తి చినఅప్పాజీ, పక్కి మణిబాల పాల్గొన్నారు.

'పథకాలకు మహనీయుల పేర్లు అభినందనీయం'

కరప, జూలై 29: మహనీయుల పేర్లతో ప్రభుత్వ పథకాలు అమలుచేయడం అభినందనీయమని టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు కొనియాడారు. కరపలో సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అమలుచేసే పథకాలకు సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కాసీతమ్మ, అబ్దుల్ కలామ్ వంటి మహనీయుల పేర్లు పెట్టినందుకు మంత్రి నారా లోకేశ్,సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై విచారణ

కరప, జూలై 29: వేళంగిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. వేళంగి-కూరాడ రోడ్డులో ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి షాపు నిర్మాణం చేశారని, వేళంగి-సిరిపురం రోడ్డులో కొప్పిశెట్టివారివీధివద్ద పంచాయతీ చెరువుగట్టును ఆక్రమించి దుకాణాలను నిర్వహిస్తున్నారంటూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీవో కొంకి అప్పారావు, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, ఆర్అండ్‌బి ఏఈ కె.సాయిబాబారెడ్డి, కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాసరావు ఆక్రమణదారులను విచారించి నివేదికను రూపొందించారు. మూడురోజుల్లోగా ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు.

వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు

ప్రత్తిపాడు, జూలై 29: మండలంలో ధర్మవరం గ్రామ శివారు పాతసినీమాహాల్ సెంటర్‌లోని జీఎల్ఆర్ వాటర్ ట్యాంక్ మరమ్మత్తులకు గురైంది. వారంరోజులుగా ఈ ట్యాం క్‌కు చెందిన మోటారు పనిచేయక తాగునీటి సరఫరా నిలిచింది. దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఊటా వీరబాబు ఆధ్వర్యంలో పలువురు కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు.

'యోగా'లో విద్యార్థుల ప్రతిభ

పిఠాపురం, జూలై 29: చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్విటేషన్ స్పోర్ట్స్ యోగా చాంపియన్‌షిప్ యోగా పోటీల్లో పిఠాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ తరపు పిఠాపురం విద్యార్థులు పవిత్ర, విజయప్రభ, చంద్రిక, సమంత అహల్య, అనన్య, శాన్వి, సాయి, స్నిగ్ధ, వెంకట్‌లు పాల్గొని అన్ని విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచారు. వీరికి ఇంటర్నేషనల్ యోగా ట్రైనర్ వనం సత్యప్రియ మార్గదర్శకత్వం వహించారు. విద్యార్థులను, యోగా గురువును పీఠికాపురం యోగా విద్యాపీఠం చైర్మన్ వనం వీరబాబు, సెక్రటరీ కొత్తెం రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

పెద్దాపురం, జూలై 29: ఈనెల 21నుంచి 28 వరకూ తిరుపతిలో మహతిఆడిటోరియంలో నిర్వహించినరాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యప్రదర్శన పోటీల్లో పెద్దాపురం పట్టణానికి చెందిన భావయామి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. నాట్యాచారులు చక్రవర్తుల పవన్‌కుమార్, పురాణం సృజన, రవిచంద్రిక వివరాలను వెల్లడించారు. 8రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో 1500మంది విద్యార్థులు పాల్గొన్నారని, జూనియర్స్ సోలో విభాగంలో దారపురెడ్డి సూర్యఅఖిల అత్యుత్తమ ప్రతిను కనబరిచిందన్నారు. మిగిలిన విభాగాల్లో పలువురు విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారన్నారు.

130మంది రక్తదానం

పెద్దాపురం, జూలై 29: తాళ్లూరి వారి సత్రంలో సాయిసేవా ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సోమవారం 130మంది రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సాయి సేవా సభ్యులు అద్దేపల్లి రమేష్, కరెడ్ల రాజా పాల్గొన్నారు.

'500 సభ్యత్వాల మార్కుదాటాం'

శంఖవరం, జూలై 29: జనసేన సభ్యత్వాల నమోదులో 500 మార్కు దాటామని జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు కరణం సుబ్రహ్మణ్యం తెలిపారు. పార్టీపైనా, పవన్‌పై నమ్మకంతో సభ్యత్వాలు చేస్తున్నామన్నారు.

'విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి'

ప్రత్తిపాడు, జూలై 29: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి కాటంబాను తెలిపారు. హైస్కూల్ సమీపంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటివ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూకు గురైనవారు ప్లేట్‌లెట్స్ పెంపుదలకు బొప్పాయి, మునగాకు వంటి తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యత మెనూ ప్రకారం వంటకాల తయారీని జడ్జి పరిశీలించారు.

శిక్షా సప్తాహలో భాగంగా సహపంక్తి భోజనాలు



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న డీఈవో

కాకినాడ రూరల్, జూలై 29: శిక్షా సప్తాహలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్నిపాఠశాలల్లోను ఈ కార్యక్రమాన్ని వారంరోజులపాటు విజయవంతంగా నిర్వహించినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. సోమవారం కాకినాడ నగరంలోని ఎస్ఎస్ఆర్కే మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల్లో దాత అల్లాడ సూర్యప్రకాశరావు ఉపాధ్యాయుల సహాయంతో సమకూర్చిన సహపంక్తి భోజనాల్లో డీఈవో పి.రమేష్, ఎంఈవో సీహెచ్‌రవి, ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్ పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు.

సామర్లకోట, జూలై 29: సామర్లకోట మండలం వేట్లపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనూ సోమవారం పలు విద్యా కార్యక్రమాలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి పి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొనగా ముఖ్యఅతిథిగా సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను అందజేశారు. జి.మేడపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ బ్యాగ్‌లను కాకినాడ జిల్లా తెలుగు రైతు సంఘ అధ్యక్షులు పాలకుర్తి శ్రీనుబాబు అందజేశారు. విద్యార్థులతో కలిసి శుభతిధి భోజనాలను స్వీకరించారు. సర్పంచ్ పటాని దేవి, పాలకుర్తి బ్రహ్మాజీచౌదరి, జాన శ్రీను, వెంకట్రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాలకుర్తి రవిబాబు పాల్గొన్నారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ హాజరయ్యారు. కిట్‌లను కౌన్సిలర్ శ్రీనువాసు అందజేశారు.

తుని రూరల్, జూలై 29: జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ శుభ భోజన్ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ప్రారంభించారు. దీనికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ విద్యార్థులకు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో తుని క్లబ్ అధ్యక్షుడు డీఎల్ మూర్తి, కార్యదర్శి కుందెం సత్యనారాయణ, పర్వత బాబురావు, మలిపెద్ది విశ్వేశ్వరరావు, గాజుల వేణుగోపాలస్వామి, ప్రధానోపాధ్యాయురాలు నూకరత్నం, డీవీఎల్‌ప్రసాద్, శివకుమార్ ఉన్నారు.

గండేపల్లి, జూలై 29: మురారిలో సోమవారం నిర్వహించిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి జాస్తి వసంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా సహపంక్తి భోజనాలు చేశారు. గండేపల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెలమాటి కాశీ ఆర్థిక సాయంతో చాగంటి సత్యనారాయణ, ఇప్పిర్ల బాబి, మాగంటి బాబి విద్యార్థులకు భోజనాలు నిర్వహించారు. మల్లేపల్లిలో హెచ్ఎం సుధారాణి ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేసి భోజనాలు నిర్వహించారు. ఎంఈవో నాయక్, గద్దే అబ్బన్న, కుక్కల ఆనందబాబు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని సర్వశిక్షాభియాన్ సీఎంవో చామంతి నాగేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలు ఎంఈవో బీవీఎస్ ప్రసాద్‌తో కలిసి గొల్లప్రోలుమండలంలోని తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలును వారు సోమవారం సందర్శించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా కొడవలి ఉన్నత పాఠశాలలో గ్రామస్తులు శుభతిథి భోజనం చేశారు.

తాళ్లరేవు, జూలై 29: మండలంలో పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు నడింపల్లి వినోద్, పొన్నాడ రాజు, నరేంద్రరెడ్డి, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌతులపూడి, జూలై 29: డీధారపల్లి పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి పరిశీలించారు. శంఖవరం జిల్లా పరిషత్ పాఠశాలలో రాజవరం గ్రామానికి చెందిన 700మంది పిల్లలకు చింతకాయల వెంకీనాయుడు స్వీట్లు అందజేశారు.

తొండంగి, జూలై 29: మండలంలోని అన్ని పాఠశాలల్లో శుభతిధి భోజనం ఏర్పాటు చేశారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి పలుచోట్ల పాల్గొన్నారు.

కోటనందూరు, జూలై 29: మండలంలోని పాఠశాలలో దాతలు సహకారంతో విద్యార్థులకు భోజనాలు అందించారు. కేవో మల్లవరంలో గాడి రాజుబాబు, కోటనందూరులో చిరంజీవిరాజు, అల్లిపూడిలో బుల్లిబాబు, జగన్నాథపురంలో గొర్లు అచ్చియ్యనాయుడు, భాస్కరరావు, సూరిబాబు అందించారు.

కరప, జూలై 29: మండలంలోని పాఠశాలల్లో సోమవారం సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, జూలై 29: డొక్కా సీతమ్మమధ్యాహ్నం భోజనం పథకాన్ని మండలంలోని చినశంకర్లపూడి, ధర్మవరంల్లో సోమవారం ప్రారంభించారు. చినశంకర్లపూడిలో టీడీపీ నాయకులు మిరియాల శ్రీను ఆధ్వర్యంలో గ్రామ నాయకులు ఈ పథకాన్ని ప్రారంభించగా ధర్మవరంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.

జగ్గంపేట, జూలై 29: శిక్ష సప్తాహ్‌లో భాగంగా సోమవారం కాట్రావులపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, మాజీ వైస్ సర్పంచ్ మునిరెడ్డి నాగేశ్వరరావు, ఏలేటి శ్రీనివాస చౌదరి, కంటే బుల్లబు, వెన్న వీరబాబు, పోలినాటి ఎర్రాశాస్త్రి, పోలినాటి ధర్మన్నకుమారి, మూడే సుజాత, షేక్ హాలియా, బాదం సూరిబాబు, పాల్గొన్నారు.